పేద విద్యార్థులంటే చిన్నచూపు



ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసినట్లయితే పేద విద్యార్థుల ఎంబీబీఎస్ కల నెరవేరదు. సాధారణంగా వైద్య విద్యనభ్యసించాలంటే రూ.కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పేద విద్యార్థులకు ఇది సాధ్యం కాదు. అదే ప్రభుత్వ మెడికల్ కళాశాలలుంటే వారి భవిష్యత్తుకు ఢోకా ఉండదు. కానీ ప్రస్తుత ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసి పేద విద్యార్థుల ఆశలను ఆడియాశలు చేసేందుకు ప్రయత్నిస్తోంది. పేద విద్యార్థులను ఈ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఇప్పటికైనా ఇలాంటి ఆలోచనలు మానుకోవాలి.

– నరసింహమూర్తి, ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు, హిందూపురం



వైద్య విద్యను దూరం చేసేందుకే..



పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రైవేటీకరణ జపం చేస్తున్నట్లు అనిపిస్తోంది. ఖరీదైన వైద్య విద్యను పేద విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి. ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నిర్వహిస్తేనే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుంది. సామాన్యులకు కూడా వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాల నిర్వహణ విషయంలో పునరాలోచన చేయాలి.

– దేవరాజు, ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు, హిందూపురం

డిగ్రీ కళాశాలలో 'స్వచ్ఛతా హీ సేవ'



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు



విద్యార్థిని, విద్యార్థులతోప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -2 ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల ఆవరణలోని చెట్ల చుట్టూ శుభ్రం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ ఓ నారాయణప్ప, హెచ్‌ఎం గోవిందప్ప ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతిజ్ఞ చేసి, మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు

మడకశిరరూరల్: మండలంలోని కల్లుమర్రి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 20, 21 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ భాస్కర్, మండల క్రీడా సమన్వయకర్త నాగభూషణ గురువారం తెలిపారు. బాల, బాలికల మండల స్థాయి ఎంపికకు అండర్ -14, అండర్ -17 పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం క్రీడా మైదానాన్ని హెచ్‌ఎం కృష్ణమోహన్ రెడ్డి, పీఈటీ ప్రకాష్‌రెడ్డి పరిశీలించారు.

చదువుతో క్రీడలూ ముఖ్యమే

పరిగి: విద్యార్థులకు చదువుతో పాటూ క్రీడలూ ముఖ్యమని ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలను వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడలతో ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనంతరం రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్ జంప్, చెస్, యోగా పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు కృపా సత్యరాజు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా సుల్తానా, ఎంపీడీఓ సరస్వతి, పీడీ వినోద్, డీటీ లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.



యోగా పోటీలను నిర్వహిస్తున్న దృశ్యం

స్వచ్ఛతా హీ సేవాపై ప్రతిజ్ఞ

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై విద్యార్థులతో అధికారులు గురువారం ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మొక్కలు నాటాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, అధికారులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

అర్థమయ్యే రీతిలో విద్యను బోధించాలి



రొళ్లలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీధర్

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు అర్థమయ్యే రీతిలో విద్యను బోధించాలని ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. గురువారం మండలంలోని రొళ్ల, హెచ్‌టీ హళ్లి, అలుపనపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయా కాంప్లెక్స్‌లో పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రొళ్లలో జరిగిన కాంప్లెక్స్ సమావేశానికి ఎంఈఓ శ్రీధర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాటినం జూబ్లీ కార్యక్రమానికి తరలిన పట్టు రైతులు



మైసూరుకు బయలుదేరుతున్న పట్టు రైతులు, అధికారులు

హిందూపురం: మైసూరులో శుక్రవారం జరిగే సెంట్రల్ సిల్క్‌బోర్డు ప్లాటినం జూబ్లీ కార్యక్రమానికి శ్రీసత్యసాయి జిల్లా నుంచి పట్టురైతులు గురువారం సెరికల్చర్ ఏడీ సురేష్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. హిందూపురం డివిజన్ నుంచి 25 మంది రైతులు, పెనుకొండ డివిజన్ నుంచి 15 మంది రైతులతోపాటు రీలర్స్, ట్విస్టర్స్ కూడా బయలుదేరారు. కేంద్ర ప్రభుత్వం సీఎస్‌బీ నిర్వహించే కార్యక్రమంలో హిందూపురం డివిజన్‌లోని శ్రీనివాసులు ఉత్తమ పట్టురైతుగా ఎంపికైనట్లు ఏడీ తెలిపారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమ శాఖ మోహన్‌రెడ్డి, నంజుడరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు మున్సిపల్ కార్మికుల విరాళం



సీఎం సహాయనిధికి పంపిన బ్యాంక్ రసీదును చూపుతున్న కార్మికులు

హిందూపురం టౌన్/ హిందూపురం: మున్సిపాలిటీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.30 వేలను అందించారు. గురువారం స్థానిక పట్టణంలోని ఇందిరాపార్కులో విలేకరుల సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ విజయవాడ వరదబాధితులకు సహాయార్థం రూ.30 వేల విరాళాన్ని రాష్ట్ర మున్సిపాలిటి కమిటీకి అందించినట్లు చెప్పారు. దాదాపు 4 లక్షల మంది వరద ప్రభావంతో తీవ్ర పరిస్థితులు ఎదుర్కొన్నారని, పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రభుత్వం వీరిని అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. హిందూపురం మున్సిపాలిటి సంఘం ఆప్కాస్ సంఘం తరఫున విరాళం సేకరించి అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాము, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి జగదీష్, మల్లికార్జున, ఆనంద్, రామచంద్ర, బాబయ్య, మూర్తి, సుబ్బలమ్మ, కవిత, నాగమణి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



మట్టితో తయారు చేసిన రైనో బొమ్మ అందిస్తున్న శాస్త్రవేత్తలు

హిందూపురం టౌన్: పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని మైసూరుకు చెందిన రీజనల్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీ శాస్త్రవేత్తలు యోగేశ్వర్, చంద్రశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలోని చిన్మయా పాఠశాలను శాస్త్రవేత్తలు సందర్శించారు. ఈ సందర్భంగా పర్యావరణాన్ని కాపాడుకోవాలని, జంతు జీవరాశులను, మొక్కలను కాపాడుకోవాలని సూచించారు. అలాగే రైనో డేను పురస్కరించుకుని బంక మట్టితో టీచింగ్ మోడల్‌గా రైనోసార్స్ బొమ్మను తయారు చేసి అందించారు. ప్రస్తుతం అంతరించిపోతున్న జీవుల్లో రైనోసార్స్ కూడా ఒకటి అన్నారు. ప్రకృతిని ప్రేమిస్తూ.. మొక్కలను పెంచడం, అడవులను సంరక్షించుకోవడం, జీవరాశులను కాపాకోవడం చేయాలన్నారు. ఎంఈఓ గంగప్ప, పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్లాసుల వితరణ

రొద్దం: మండలంలోని నల్లూరు అంగన్‌వాడీ కేంద్రం -2లో చిన్నారులకు అదే గ్రామానికి చెందిన నరసింహమూర్తి గురువారం గ్లాసులు, ప్లేట్లు, కుర్చీలు వితరణ చేశారు. అనంతరం పోషణ మాసోత్సవాల సందర్భంగా పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి.లక్ష్మీదేవి, జె. లక్ష్మీదేవి, ఆయాలు పాల్గొన్నారు.

టీ బంక్‌లో చోరీ

రొళ్ల: మండలంలోని కొడగార్లగుట్టకి చెందిన దేవరాజు టీ బంకులో బుధవారం రాత్రి చోరీ జరిగింది. రూ.20 వేల నగదు, సిగరెట్లు, ఇతర వస్తువులు ఎత్తుకెళ్లారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

22న వినాయక నిమజ్జనం



ర్యాలీ నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

అమరాపురం: స్థానిక వినాయకనగర్‌లో పూజలందుకుంటున్న వరసిద్ధి వినాయకుని నిమజ్జనం, శోభాయాత్ర ఈనెల 22న జరుగుతుందని వరసిద్ధి వినాయక కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఈసందర్భంగా వారు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

బైక్‌పైనే మృతదేహం తరలింపు



బైక్‌పై తండ్రి మృతదేహాన్ని తరలిస్తున్న కుమారులు

పావగడ: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తండ్రి మృతిచెందాడు.. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లేందుకు అతని కొడుకులు అంబులెన్స్ కోసం ఎదురుచూశారు. అంబులెన్స్‌లు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ వాహనాన్ని అయినా పురమాయించాలని ప్రయత్నించారు. వాహన డ్రైవర్లు ఎవరూ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఇష్టపడకపోవడంతో చేసేదేమీలేక కొడుకులే.. తండ్రి మృతదేహాన్ని బైక్‌పై మధ్యలో కూర్చోబెట్టుకొని సొంతూరుకు తీసుకెళ్లారు. పావగడ తాలూకాలోని దళవాయిహళ్లికి చెందిన వృద్ధుడు గుడగుల్ల హొన్నూరప్ప (80) ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. స్థానికంగా వైద్యులతో చూపించినా ఫలితం లేకపోయింది. కుమారులు అతన్ని ఈనెల 17న వైఎన్ హొసకోటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయితే కోలుకోలేని హొన్నూరప్ప గురువారం మృతి చెందాడు. దీంతో తమ తండ్రి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లేందుకు కుమారులు అంబులెన్స్ కోసం ఎదురు చూశారు. ఎంత సేపటికీ వాహనం రాకపోయే సరికి ప్రైవేట్ వాహనం కోసం ప్రయత్నించారు. అయితే మృతదేహాన్ని తీసుకెళ్లడానికి ప్రైవేటు వాహనాల డ్రైవర్లు అంగీకరించలేదు. దీంతో మృతుడి పెద్ద కుమారుడు చంద్రణ్ణ, చిన్న కుమారుడు గోపాలప్ప తమ బైక్‌పైనే తండ్రి మృతదేహాన్ని మధ్యలో కూర్చోపెట్టుకొని గ్రామానికి తీసుకువెళ్లారు. అనంతరం తండ్రి భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు



రొళ్ల మండలం రత్నగిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో హై జంప్ చేస్తున్న విద్యార్థిని

లేపాక్షి: స్థానిక నీలం సంజీవరెడ్డి ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, చెస్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యాక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వీవీసీ గిరి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

రొళ్ల: మండలంలోని రత్నగిరి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో ఎంఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం స్కూల్ గేమ్ ఫెడరేషన్ తరఫున క్రీడా పోటీలను నిర్వహించినట్లు పాఠశాల పీడీ మోహన్ తెలిపారు. ఇందులో వాలీబాల్ పోటీలో ఎం.రాయాపురం, కబడ్డీ పోటీలో రత్నగిరి, ఖోఖో పోటీలో కేజీబీవీ, లాంగ్‌జంప్ విభాగంలో హొట్టేబెట్ట, షటిల్‌లో రొళ్ల, హై జంప్ విభాగంలో హొట్టేబెట్ట, షాట్‌పుట్ విభాగంలో ఎం.రాయాపురం ఉన్నత పాఠశాల జట్టు విజయం సాధించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులు త్వరలో తాలూకా స్థాయిలో జరిగే పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు షబ్బీర్, చంద్రశేఖర్, వందన, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

హిందూపురం: పట్టణ శివారులోని ఇందిరమ్మకాలనీ సాయిబాబా గుడి వద్ద గురువారం ప్రైవేటు బస్సు ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..మనేసముద్రంకు చెందిన సంతోష్‌కుమార్ బైక్‌పై హిందూపురానికి బయలుదేరాడు. ఈక్రమంలో ఎదురుగా వేగంగా వచ్చిన వెంకటేశ్వర ప్రైవేటు బస్సును బైక్‌ను ఢీకొంది. ఘటనలో సంతోష్‌కుమార్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరు రెఫర్ చేశారు. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కారు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

పరిగి: మండలంలోని 544ఈఈ జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పరిగి చెరువులో చేపలు పట్టే కూలీలు వెంకటేష్, రంగా పరిగి వైపు నుంచి బైక్‌లో వెళ్తున్నారు. కొడికొండ చెక్‌పోస్టు వైపు నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ఎదురుగా బైకును ఢీకొట్టింది. ఘటనలో బైకుపై వెళ్తున్న ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఢీకొట్టిన కారు అక్కడి నుంచి వెళ్లిపోయింది. క్షతగాత్రులను హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

క్లుప్తంగా

బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మన పర్యావరణం–మన చేతుల్లో అనే అంశంపై కళాశాలలో గురువారం జేవీవీ వ్యాసరచన పోటీలు నిర్వహించింది. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో ప్రిన్సిపాల్ సుదర్శన్, రేంజర్ శ్రీనివాసరెడ్డి, సీపీఎం హరి తదితరులు పాల్గొని పర్యావరణ ప్రాధాన్యత, దానిని కాపాడుకోవడానికి విద్యార్థులు చేయాల్సిన చర్యలు, బాధ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, సత్యసాయి కళాశాల ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి అధ్యాపకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా మారుతీ ప్రకాష్

అమరాపురం: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మారుతీ ప్రకాష్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందుబాటులో ఉండి రైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోరంట్ల: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ మండలి ఆధ్వర్యంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ సంస్థ ప్రతినిధులు గురువారం స్థానిక ఎస్‌ఏపీఎస్ జూనియర్ కళాశాలలో ఎచ్‌ఐవీ, ఎయిడ్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ సంస్థ డీఆర్‌పీ రమేష్ యాదవ్ ఎచ్‌ఐవీ, లైంగికంగా సంక్రమించే వ్యాధుల గురించి వివరించారు. ఎయిడ్స్ వాధిగ్రస్తులపై వివక్ష చూపితే టోల్ ఫ్రీ నెంబర్ 1097కు ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులు చేడు అలవాట్లకు దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ సూర్యనారాయణ సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ ఇండియా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

మడకశిరరూరల్: ఆంధ్ర,కర్ణాటక సరిహద్దులోని బేడత్తూరు సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మడకశిర వాసికి తీవ్ర గాయాలయ్యాయి. మడకశిర మండలం బచ్చలయ్యపాళ్యం గ్రామానికి చెందిన బీ నరసింహమూర్తి కారులో మధుగిరి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా బేడత్తూరు వద్ద కారు అదుపు తప్పింది. మిడిగేశి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బేకరి సిబ్బందిపై దాడి

పెనుకొండ రూరల్: కియా పరిశ్రలోకి తినుబండారాలు అందించే బేకరీ సిబ్బందిపై దాడి ఘటన అలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. గుట్టూరుకు చెందిన పల్లవ రాజు, అతని అనుచరులు అమ్మవారిపల్లిలో బ్యాంక్ బిల్డింగ్‌లో బేకరీ సిబ్బందిపై మంగళవారం దాడి చేశారు. ఈ విషయమై స్థానిక కియా పోలీస్ స్టేషన్‌లో గురువారం బేకరీ యజమాని మనోజ్ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సత్తా చాటిన అరసికెరె విద్యార్థులు

పావగడ: తాలూకాలోని అరసికెరె ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు భరత్, ఎం.యోగీశ్ జిల్లా స్థాయి విజ్ఞాన వస్తు ప్రదర్శన పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచారు. ఉపాధ్యాయుల విభాగంలో అదే పాఠశాల విజ్ఞాన శాస్త్రం ఉపాధ్యాయుడు జీహెచ్ రేణుకా రాజ్ జిల్లా స్థాయి విజ్ఞాన నమూనా వస్తు ప్రదర్శనలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

విద్యుదాఘాతంతో సర్వేయర్ మృతి



మృతి చెందిన పవన్

అమరాపురం: తమ్మడేపల్లికి చెందిన సర్వేయర్ పవన్ (27) విద్యుదాఘతంతో గురువారం మృతి చెందాడు. వివరాలు.. తమ్మడేపల్లికి చెందని నాగమ్మ కుమారుడు పవన్ వి.అగ్రహారం గ్రామ సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. తన ఇంటిలోని బాత్‌రూములో మోటారుకు విద్యుత్ కేబుల్ ఏర్పాటు చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. తల్లి నాగమ్మ అప్రమత్తమై పవన్‌ను తప్పిస్తుండగా ఆమెకు విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే స్థానికులు వారిని అమరాపురం పీహెచ్‌సీకి, అక్కడి నుంచి మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పవన్ మృతిచెందాడు. తల్లి నాగమ్మ చికిత్స పొందుతోంది.

రైతులకు ఉలవలు పంపిణీ

గుడిబండ: మండలంలోని మందలపల్లిలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు గురువారం ఉలవలు పంపిణీ చేశారు. 80శాతం సబ్సిడీతో పంపిణీ చేసినట్లు ఏఓ వీరనరేష్ తెలిపారు. కార్యక్రమంలో మందలపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని రైతులకు ఉలవలు గురువారం పంపిణీ చేశారు. రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి 10 కేజీల ప్రకారం పంపిణీ చేశామని ఆయన తెలిపారు. 80 శాతం సబ్సిడీ పోనూ మిగిలిన రూ.174తో పంపిణీ చేశామన్నారు.

సీఆర్పీలను మాతృ మండలాల్లో కొనసాగించాలి

రొళ్ల: సీఆర్పీలను మాతృ మండలాల్లోనే కొనసాగించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొస్‌లాజం, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో కోరారు.

లేపాక్షి ఎస్‌ఐ బదిలీ

లేపాక్షి: స్థానిక ఎస్‌ఐ గోపి తనకల్లు మండలానికి బదిలీ అయ్యారు. గురువారం మధ్యాహ్నం ఆయన రిలీవ్ అయ్యారు. ఈసందర్భంగా పోలీసు సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు.

లారీని ఢీ కొన్న బొలెరో

సోమందేపల్లి: మండలంలోని పేటకుంట సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీని వెనుక వైపు నుంచి బొలెరో వాహనం ఢీ కొన్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. బెంగళూరు వైపు నుంచి చెన్నేకొత్తపల్లికి వెళ్తున్న బొలెరో వాహన డ్రైవర్ నిద్ర మత్తులో ముందు వెళ్తున్న సిమెంట్ లారీను ఢీ కొన్నాడు. ఘటనలో డ్రైవర్ సుబ్రమణ్యం గాయపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఈ-కేవైసీ చేయించాలి

అగళి: పంటలు సాగు చేసిన ప్రతి రైతూ ఈ–కేవైసీ చేయించుకోవాలని ఏడీఏ సనావుల్లా సూచించారు. గురువారం మండలంలోని తోణసన్నపల్లి గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రాగి పంట తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందే మేలైన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి, ఈ–కైవైసీ ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు అబ్బుల్, శేఖర్ నాయక్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'బాలసదన్'కు అవకాశం

పెనుకొండ: 10 సంవత్సరాల్లోపు అనాథ బాలికలను హిందూపురం బాలసదన్‌కు చేర్చే అవకాశం ఉన్నట్లు సీడీపీఓ శాంతలక్ష్మి గురువారం తెలిపారు. ఎక్కడైనా అనాథ పిల్లలుంటే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలసదన్‌లో చేర్చడానికి ప్రజలు సహకరించాలన్నారు.

యువకుడి ఆత్మహత్య

అమరాపురం: మండలంలోని ఉప్పార్లపల్లి గ్రామానికి చెందిన ఈరన్న కుమారుడు ఆనంద్ (26) పురుగుల మందు తాగి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన మేరకు..ఆనంద్ కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగాడు. వెంటనే అతన్ని మడకశిర ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి హనుమక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

విధులు సమర్థవంతంగా నిర్వహించండి



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

పెనుకొండ: సచివాలయ సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. తోటగేరి సచివాలయంలో గురువారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రోగ్రెస్‌కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రోజువారీ విధులు, బయోమెట్రిక్, అటెండన్స్, పన్నుల వసూళ్లు ఇతర కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు.